క్లుప్తంగా

దర్గాలో ప్రత్యేక ఫాతెహాలు



ఖాదర్‌లింగ స్వామి సమాధికి పూజలు చేస్తున్న భక్తులు

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలను, ప్రార్థనలు చేశారు. దీంతో దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం రంజాన్ పండుగ కలిసి రావడంతో భక్తులు స్వామి సన్నిధిలోనే వేడుకలను జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

చెక్‌పోస్టుల తనిఖీ



ఆదోని సెబ్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న సెబ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్

ఆదోని రూరల్: ఆదోని సెబ్ స్టేషన్, పెద్ద హరివాణం, బాపురం చెక్‌పోస్టులను గురువారం సాయంత్రం సెబ్ నోడల్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, సెబ్ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు స్టేషన్లు, చెక్‌పోస్టుల పనితీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు తెలియజేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యం, డ్యూటీ పెయిడ్ మద్యం స్టాక్ పాయింట్లను గుర్తించి వాటిపై దాడులు జరిపి సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అక్రమ మద్యంపై విస్తృతంగా దాడులు జరపాలని సూచించారు. వీరి వెంట ఆదోని సెబ్ సీఐ విన్నీలత, సిబ్బంది ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న కమిటీ సభ్యులు

పెద్దకడబూరు: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో ఈ నెల 17న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మిగనూరు నియోజకవర్గం అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ తరఫున రూ.15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం ఎమ్మిగనూరులోని కేవీపీఎస్ కార్యాలయంలో.. ఆ సమితి జిల్లా అధ్యక్షుడు దేవసహాయం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య మాదిగ, అంబేడ్కర్ భవన సాధన కమిటీ చైర్మన్ కదిరికోట ఆదెన్న, కంబదహాల్ గ్రామ అంబేడ్కర్ విగ్రహ నిర్మాణ కమిటీ నాయకులు అనందరాజు, రాజులకు చెక్కును అందజేశారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అన్ని విధాలుగా తోడుగా ఉంటామన్నారు. కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కనకవీడు రాజు, నాయకులు కనకవీడు పూజారి, నాగప్ప, మాచాపురం గంగన్న పాల్గొన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి

కోసిగి: స్థానిక సాయిబాబా నగర్ కాలనీలో నివాసం ఉంటున్న టీడీపీ చెందిన 25 మంది కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి సమక్షంలో ఆ పార్టీలో చేరారు. గురువారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టిన టీడీపీకి చెందిన కపటి భీమయ్య, కొరివి సుంకయ్య, అరికేర తిక్కస్వామి, చిన్న వీరస్వామి, వెంకట రాజు, రామకృష్ణ, పెద్ద వీరస్వామి, నాగరాజు, లక్ష్మన్నలతో పాటు ఆ కుటుంబ సభ్యులు మహిళలతో కలిసి 25 మంది పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో తమ కుటుంబాలకు ఎంతగానో లబ్ధి చేకూరిందన్నారు. ఆయన పరిపాలనకు మెచ్చి పార్టీలోకి చేరినట్లు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షులు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, మంగమ్మ, గానిగ వీరస్వామి, ముకుంద కృష్ణమూర్తి పాల్గొన్నారు.

జింకపిల్ల అప్పగింత

మద్దికెర: మంద నుంచి తప్పిపోయి వచ్చి మద్దికెర శివార్లలోని నల్లరేగడి పొలాలలో తిరుగుతున్న జింక పిల్లను రాజు అనే రైతు గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ చెన్నయ్యకు అప్పగించారు. ఏఎస్ఐ మాట్లాడుతూ జింకపిల్లను అటవీ శాఖ అధికారులకు అందజేస్తామన్నారు.



పెద్దకడబూరులో ముస్లింలకు రంజాన్ శుభకాంక్షలు తెలుపుతున్న వై.ప్రదీప్‌రెడ్డి



ఆదోని మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మంత్రాలయంలో ఈద్గాలో సందేశం ఇస్తున్న ఇమాం ఖాజా బందెనవాజ్

ఈద్ ముబారక్

ఆదోని సెంట్రల్: పవిత్రమైన రంజాన్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గురువారం జామియా మసీదు, చందశా దర్గా, ఇమామ్ దర్గా, గుల్బరోజ్ దర్గా, మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దైవ కరుణ ఉపవాసాలతో పాటు సృష్టికర్త దయ, అనుగ్రహం ఉండేలా ప్రార్థనలు చేయాలని ఖురాన్ సూచిస్తుందని గురువులు తెలిపారు. దానధర్మాలతో పాటు దైవ చింతన, అపారమైన నమ్మకం, క్రమశిక్షణ కలిగి ఉండాలని వారు కోరారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకుడు చంద్రకాంత్ రెడ్డి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరికి అల్లాహ్ అనుగ్రహం ఉండాలని అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు. ముస్లిం యువకులు, పెద్దలు ఎమ్మెల్యేను సన్మానించారు.

మంత్రాలయం: స్థానిక జామియా మసీదు నుంచి ముస్లింలు ఊరేగింపుగా బయలుదేరి జాతీయ రహదారిలోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు షేక్ ఇమాం ఖాజా బందెనవాజ్ రంజాన్ మాస పవిత్రను ప్రవచించారు. ఎస్ఐ గోపీనాథ్ నేతృత్వంలో బందోబస్తు చేపట్టారు. అలాగే మండలంలోని మాలపల్లి, మాధవరం, వగరూరు, చిలకలడోణ గ్రామాల్లోనూ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.

పెద్దకడబూరు: మండల పరిధిలోని కల్లుకుంట, హెచ్.మురవణి, మేకడోణ, చిన్నతుంబళం, బసలదొడ్డి తదితర గ్రామాలల ముస్లింలు భక్తి గీతాలు ఆలపిస్తూ ఈద్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. కల్లుకుంటలో మతగురువు సయ్యద్ లతీఫ్ ఖాద్రి ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. మతగురువు మాట్లాడుతూ.. రంజాన్ పండుగ ప్రత్యేకతను వివరిస్తూ ప్రతి ఒక్కరితో స్నేహభావాన్ని కలిగి ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పెద్దకడబూరు ఈద్గా దగ్గరకు వెళ్లి ముస్లిలను కలిసి రంజాన్ శుభకాంక్షలు తెలిపారు.



ఆదోనిలో ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న ముస్లింలు

కౌతాళం: మండలంలో ముస్లింలు ఉదయం 5 గంటలకు ఫజర్ నమాజ్ తర్వాత 8 గంటలకు మసీదులకు చేరి తక్బీర్ చదువుకుంటూ ఈద్గాకు వెళ్లి సామూహిక ప్రార్థనలు జరిపారు. సన్మార్గంలో నడిచి అల్లా కృపకు పాత్రులు కావాలని మతపెద్దలు సూచించారు. సంపాదించిన మొత్తంలో రెండున్నర శాతం జకాత్ రూపంలో ఇవ్వాలని, ఒక్కొక్కరికి రూ.80 చొప్పున ఫిత్రా ఇవ్వాలని, ఈ పద్ధతులను ముస్లింలందరూ పాటించాలన్నారు. కౌతాళంలోని ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో ఖాజీసాబ్ నమాజు విశిష్టత వివరించారు. జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలోని ఈద్గాలో ప్రత్యేక నమాజులు ఆచారించారు. దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా వుసేని చిష్తీ భక్తులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కౌతాళంతోపాటు కుంటనహల్, బదినేహల్, హాల్వి, నదిచాగి, చిరుతపల్లి, చూడి, ఎరిగేరి, కామవరం, ఉప్పరహాల్ బాపురం, రౌడూరు గ్రామాల్లో ఈదుల్ ఫితర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నమాజుకు వెళ్లే ముందు ఫిత్రా కింద రెండున్నర కేజీల గోధుములను దానంగా ఇచ్చి వెళ్లారు. ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధంలో వేలాది మంది మరణించడమే గాక నిరాశ్రయులైన వారిని అల్లా కాపాడాలని యుద్ధం సమప్తం కావాలని దువా చేశారు.

కోసిగి: స్థానిక జామియా మసీదు, నూరాణి సున్నీ మసీదు, మదీనా మసీదు, మజీదే ఏఅక్సా మసీదుల నుంచి ముస్లింలు ర్యాలీగా బయలుదేరి రైల్వేగేటు సమీపంలో ఈద్గా దగ్గరకు చేరుకున్నారు. అక్కడ మతగురువు జాకీర్ మౌలానా నేతృత్వంలో ప్రత్యేక నమాజ్ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి ఈద్గా దగ్గరకు చేరుకుని మతగురువు జాకీర్ మౌలానాను శాలువా, పూలమాలలు వేసి సన్మానించి ముస్లింలకు రంజాన్ శుభకాంక్షలు తెలిపారు. ఎస్ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఈద్గాలు, మసీదుల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న, మాణిక్య రాజు, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, కోసిగయ్య, నరసింహులు పాల్గొన్నారు.





కల్లుకుంటలో ఖురాన్ సూక్తులను బోధిస్తున్న సయ్యద్ లతీఫ్ ఖాద్రి , కౌతాళం ఈద్గాలో నమాజు చేస్తున్న ముస్లింలు



కోసిగిలో ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



మత గురువు జాకీర్ మౌలానాను సన్మానించి రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

జగనన్నతోనే పేదల అభ్యున్నతి

కోసిగి: పేదలు బాగుండాలంటే వారికోసం నిరంతరం తాపత్రయపడే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి అన్నారు. ఆయన గురువారం కోసిగి కడపాళెం వీధిలోని కాశమ్మ గడ్డ, బసవన్న కట్ట, ఎస్సీ కాలనీ, విద్యుత్ సబ్ స్టేషన్ వెనుకభాగంలోని కాలనీ, సాయిబాబా కాలనీలలో మండల నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలుచేశారని గుర్తుచేశారు. బడికి వెళ్లే పిల్లల కోసం అమ్మ ఒడి, ఇంటి వద్దకే పింఛన్, వైఎస్సార్ చేయూత, ఆసరా, విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన, ఆరోగ్య శ్రీ, రైతు భరోసా, తదితర సంక్షేమ పథకాలు నేరుగా ఇంటి వద్దకే అందించారని వివరించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పరిపాలన సాగించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పుకోదగ్గ ఒక్క పథకం అయినా అమలుచేశారా అన్ని ప్రశ్నించారు. పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నా, వారు అభ్యున్నతి చెందాలన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని, మరోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను గెలుపించుకుందామని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డి, ఎంపీగా బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టనగౌడ, శ్రీనివాస రెడ్డి, ఎంపీపీ ఈరన్న, నాడుగేని నాగరాజు, మంగమ్మ, మాంతేష్ స్వామి, మాణిక్యరాజు, నరసింహులు, కోసిగయ్య, బండ్ల గోవిందు, గానిగ వీరస్వామి, కృష్ణమూర్తి, బసవరాజు, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



ఆటోలో వెళుతున్న కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న పి.మురళీ మోహన్ రెడ్డి

ఎల్లెల్సీకి నీటి సరఫరా బంద్

హొళగుంద: కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న టీబీ డ్యాం నుంచి తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కి నీటి విడుదలను గురువారం నిలిపివేశారు. ఈ ఏడాది వర్షాభావం కారణంగా డ్యాంలో ఆశాజనకంగా నీరు చేరకపోవడంతో టీబీ బోర్డు అధికారులు గతేడాది డిసెంబర్ 25న కాలువకు నీటిని బంద్ చేసిన సంగతి తెలిసిందే. తిరిగి తాగునీటి అవసరాల కోసం ఫిబ్రవరి 19వ తేదీ నుంచి దిగువ కాలువకు 480 క్యూసెక్కుల ప్రకారం నీటిని వదులుతూ గురువారం నిలిపివేశారు. ఎండ తీవ్రత వల్ల డ్యాంలో నీటిమట్టం డెడ్ స్టోరేజ్‌కు పడిపోతుండడంతో నీటి విడుదలను బంద్ చేసి మళ్లీ వర్షాకాలం మొదలై సకాలంలో డ్యాంలో నీరు చేరితే జూలై నెలలో విడుదల చేస్తారు. డ్యాంలో ప్రస్తుతం 1579.07 అడుగులతో 4.034 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో జీరో కాగా అవుట్ ఫ్లో 171 క్యూసెక్కులుంది. బళ్లారి పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ నెల 28వ తేదీ వరకు ఎల్లెల్సీకి 100 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగించనున్నారు.

జగనన్నతోనే పారదర్శక పాలన

పెద్దకడబూరు: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అవినీతి రహిత పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం మండల పరిధిలోని గవిగట్టు, సాయంత్రం పీకలబెట్ట, బాపులదొడ్డి గ్రామాలలో ఎన్నికల ప్రచారం చేశారు. నాయకులు, కార్యకర్తలతో కలసి ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను అందించి ఓట్లను అభ్యర్థించారు. ఆయన మాట్లాడుతూ.. అవ్వాతాతలకు ఇంటివద్దకే పింఛను, కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగనన్ననే గెలిపించుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలన్నీ రద్దవుతాయని, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు తప్పవన్నారు. మంత్రాలయం నుంచి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేసి, వేయించి అఖండ విజయాన్ని అందించాలని అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జేఏసీ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, సర్పంచ్‌లు నాగరాజు, మూలింటి లక్ష్మి, చంద్రశేఖర్, నాయకులు విజయేంద్రరెడ్డి, రఘురాముడు, గజేంద్రరెడ్డి, ముక్కరన్న, అర్లప్ప, మూకారెడ్డి, మహాదేవ, యల్లప్ప, కాశీం తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై.ప్రదీప్ రెడ్డి

అక్రమ మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా

కోసిగి: కర్ణాటక ప్రాంతాల నుంచి అక్రమ మద్యం రాష్ట్రంలోకి రాకుండా ప్రత్యేక నిఘా ఉంచాలని హెడ్ క్వార్టర్స్ నేర విభాగం సెబ్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.సుధాకర్ రెడ్డి సూచించారు. గురువారం కోసిగి సెబ్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా నాన్ డ్యూటీ ఫైడ్ మద్యం, నాటుసారా, బెల్టుషాపులపై విస్తృతంగా దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలని కోసిగి సెబ్ ఎస్ఐ రమేష్‌బాబు, సిబ్బందిని ఆదేశించారు. పాతనేరస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేయాలన్నారు. అక్రమ మద్యం తరలించే మార్గంలో రోజూ రూట్ వాచ్ నిర్వహించాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విధులు నిర్వర్తించాలన్నారు. కర్నూలు సెబ్ జిల్లా టాస్క్ ఫోర్స్ సీఐ నర్సానాయుడు, సిబ్బంది వెంట ఉన్నారు.



కోసిగి సెబ్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి

కేంద్ర బలగాల కవాతు

మద్దికెర: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతి భద్రతలపై ప్రజలకు భరోసా కల్పించేందుకు కేంద్ర బలగాలతో కవాతు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బొజ్జనాయునిపేట, కొత్తపల్లి, బసినేపల్లి, మదనంతపురం గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

పూలే సేవలు చిరస్మరణీయం





వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు, నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని టౌన్: అణగారినవర్గాల అభ్యున్నతే జ్యోతిరావు పూలే లక్ష్యమని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవా, సీనియర్ మాజీ కౌన్సిలర్ సింహం నాగేంద్ర అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా జరుపుకున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. వారు మాట్లాడుతూ.. పేదల విద్యాభివృద్ధి, రాజకీయ చైతన్యం, కుల వివక్ష నిర్మూలన కోసం జ్యోతిరావు పూలే ఎంతో కృషి చేశారన్నారు. నేటి యువత పూలే అడుగుజాడల్లో నడవాలన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు గోవిందు, ప్రసాద్, యల్లప్ప, హరిక్రిష్ణ, నారాయణ, నాగరాజ్, శీను, గంగాధర్, వేణు, మణి, బొబ్బిలి, నల్లారెడ్డి, బాబు, రమేష్, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: సామాజిక సంఘసంస్కర్త, దార్శనికుడు జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను గురువారం బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీసీ ఫెడరేషన్ తాలూకా అధ్యక్షుడు మరియాని చెన్నబసప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి నాయుడు మాట్లాడుతూ పూలే సేవలను కొనియాడారు నాయకులు పి.కోదండ, దేవిశెట్టి ప్రకాష్, వడ్డె శ్రీనివాసులు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దకడబూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: ఎస్టీయూ నాయకుల ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను ఆ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆదోని మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్‌బాబు, హెచ్ఎం బి.సత్యన్న హాజరై మాట్లాడారు. సమసమాజ నిర్మాణానికి పూలే ఎంతో కృషి చేశారన్నారు. ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బి.మహాదేవప్ప, యం.సి.సుంకన్న, బి.గోపాల్, యల్.రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: పీడిత జన బాంధవుడు జ్యోతిరావు పూలే అని ఫోరం ఫర్ ఆర్టీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బొగ్గుల తిక్కన్న అన్నారు. పూలే జయంతి వేడుకలను పెద్దకడబూరు ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. నాయకులు ఆనందరాజు, బజారప్ప, మూకన్న, పకీరప్ప, తిమ్మప్ప తదితరులు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నాడు అవస్థలు.. నేడు సౌకర్యాలు

- ఎన్.రామయ్య మున్సిపల్ స్కూల్‌కు పక్కా భవనంతో తీరిన విద్యార్థుల కష్టాలు
- తప్పిన అద్దె భారం
- అన్ని వసతులతో విద్యాబోధన






నాడు - అద్దె భవనం వరండాలో విద్యార్థులకు తరగతులు, నేడు - పాఠశాలకు పక్కా భవనం

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణం విజయభాస్కరెడ్డి కాలనీ, భీమ్‌రెడ్డి కాలనీ, వైఎస్సార్ కాలనీలలో కూలీ పనులు చేసుకుని జీవనం సాగించే వారు ఎక్కువగా ఉన్నారు. తమ పిల్లలను బడికి పంపాలంటే కల్లుబాయి లేదా శంకర్ నగర్, ఆర్‌ఆర్ లేబర్ కాలనీలోని పాఠశాలలకు పంపించాల్సి ఉంటుంది. పిల్లలను బడికి పంపాలంటే ఆదోని నుంచి ఆలూరుకు వెళ్లే మెయిన్ రోడ్డు దాటి వెళ్లాల్సిన పరిస్థితి. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆయా కాలనీవాసులు ఆందోళన చెందేవారు. తమ కాలనీలో పురపాలక పాఠశాలను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు, స్థానిక ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్ రెడ్డికి విన్నవించారు. వారి అవసరాలను గుర్తించిన అధికారులు, పాలకులు పురపాలక కార్యాలయం సమీపంలోని ఎన్.రామయ్య ప్రాథమిక పాఠశాలను భాస్కర్ రెడ్డి కాలనీలోకి 2019లో షిఫ్ట్ చేశారు. అక్కడ అద్దెకు ఇంటిని తీసుకొని పాఠశాలను ప్రారంభించారు. 37 మందితో ప్రారంభమైన ఈ పాఠశాలలో నేడు 1 నుంచి 5వ తరగతి వరకు 103 మంది విద్యార్థులు ఉన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగానే నలుగురు ఉపాధ్యాయులను కూడా నియమించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యార్థులకు తరగతి గదులతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో నాడు–నేడు పథకానికి శ్రీకారం చుట్టారు. విద్యార్థులకు తరగతి గదుల నిర్మాణం చేపట్టాలంటే స్థలం అవసరం అవుతుంది. ఈ మేరకు పురపాలక కౌన్సిల్ సమావేశంలో భాస్కర్‌రెడ్డి కాలనీలోని 50 సెంట్ల స్థలాన్ని కేటాయించి తరగతి గదుల నిర్మాణానికి ఎస్టిమేట్‌లను తయారు చేసి అధికారులకు పంపారు. గదుల నిర్మాణంతో పాటు, వంటగది, టాయిలెట్స్, విద్యుత్, తాగునీటి వసతి సౌకర్యాల నిమిత్తం ప్రభుత్వం రూ.42 లక్షల నిధులను మంజూరు చేసింది. ప్రస్తుతం మంజూరైన రూ.21 లక్షల నిధులతో తరగతి గది, వంటగది, టాయిలెట్స్, విద్యుత్, తాగునీటి వసతి వంటి సౌకర్యాలను కల్పించారు. విద్యార్థులకు ఆడుకోవడానికి విశాలమైన స్థలం ఉంది. భవిష్యత్తులో మిగతా నిధులను విడుదల చేసి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరిన్ని గదులను నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుదని స్థానికులు చెబుతున్నారు. గతంలో అద్దె ఇంట్లో విద్యార్థులకు విద్యాబోధన సాగించడం కష్టతరంగా ఉండేది, ప్రస్తుతం సమస్య తీరిందని పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పాఠశాలలో ఏర్పాటు చేసిన టాయ్‌లెట్స్

అన్ని సౌకర్యాలు కల్పించారు



గతంలో అద్దె ఇంట్లో పిల్లలకు చదువు చెప్పేసమయంలో ఎలాంటి సౌకర్యాలు లేవు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. పాఠశాలకు గదులు నిర్మించాలని మా కాలనీవాసులు ఎన్నోసార్లు అధికారులకు, పాలకులకు విన్నవించారు. దీంతో ప్రభుత్వం గదుల నిర్మాణం చేపట్టింది. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను సమకూర్చింది. ఇప్పుడు పిల్లలు సంతోషంగా బడికి వెళుతున్నారు. – శ్వేత, విద్యార్థి తల్లి, ఆదోని

విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు

నాడు–నేడు పథకం కింద నిధులు మంజూరు కావడంతో ఒక తరగతి గది, వంటగది, టాయిలెట్స్ వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశాం. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఇంకా రెండు తరగతి గదులు అవసరం. ఈ విషయాన్ని అధికారులకు విన్నవించాం. ప్రస్తుతం టిన్ కాంపొనెంట్ కింద పాఠశాలకు కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టేందుకు అనుమతి ఇచ్చారు. నిధులు విడుదలైతే ఆ పనులను కూడా చేపడతాం. పాఠశాలకు పక్కా భవనంతో పాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా కృషి చేస్తున్నాం.

– జగన్‌మోహన్ రావు, ప్రధానోపాధ్యాయుడు, ఎన్.రామయ్య పురపాలక పాఠశాల, ఆదోని

లారీ ఢీకొని విరిగిపడ్డ విద్యుత్ స్తంభాలు



ఐరన్‌బండ గ్రామంలో విరిగిపడ్డ విద్యుత్ స్తంభం

గోనెగండ్ల: మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామంలో ఉల్లిగడ్డల లారీ ఢీకొనడంతో 5 విద్యుత్ స్తంభాలు, ఒక ట్రాన్స్‌ఫార్మర్ విరిగిపడ్డాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో ఓ రైతు పండించిన ఉల్లిని లోడ్ చేసుకునేందుకు గురువారం ఉదయం కర్నూలు నుంచి లారీ వచ్చింది. లారీ రైతు పొలం వద్దకు వెళుతుండగా పైన ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో ఒకదానికి ఒకటి ఊగుతూ 5 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఓ స్తంభానికి ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కిందపడింది. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న విద్యుత్ సిబ్బంది గ్రామానికి చేరుకొని సరఫరా పునరుద్ధరించే పనులు చేపట్టారు. దీనిపై ఏఈ సుధాకర్‌రావు మాట్లాడుతూ.. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, గ్రామంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు.